# స్త్రీజనోద్ధరణ?

డాక్టర్ ఆర్వియస్ -1-

అది ఒక మహానగరం

సమయం రాత్రి పదకొండు గంటలు.

ఊరు నిద్రలోకి జారుకుంటూంటే, కొన్ని పేటలు మేలుకుని ఒళ్ళు విరుచుకుంటున్నాయి.

అంతటా సందడి తగ్గితే అక్కడ సందడి మొదలయింది. నలభై దాటిన అతివల దగ్గర్నించి, పదిహేను దాటని అమ్మాయిల వరకు అందంగా అలంకరించుకుని వీధుల్లో నిల్చున్నారు విటులకోసం.

వాళ్ళ మనసులో ఏముందో గానీ పెదవులు మాత్రం చిరునవ్వులు చిందిస్తున్నాయి. మనుషుల సంగతేమో గానీ వారి బట్టలు సువాసనలు వెదజల్లుతున్నాయి.

పగలు పెద్ద మనుషుల్లా, శ్రీరామచంద్రుల్లా తిరిగే ఎంతోమంది తలలు దించుకుని ఓరగా అమ్మాయిలకేసి చూస్తూ నచ్చిన అమ్మాయిలతోపాటు లోపలికి నడుస్తున్నారు.

పన్నెండు గంటలు కావస్తుండగా దాదాపు అన్ని తలుపులూ మూసుకున్నాయి, ఒక్క నాగిని ఇంటి తలుపు తప్ప.

నాగినికి పాతికేళ్ళుంటాయి. నిమ్మపండు ఛాయ, తీరైన కను ముక్కు తీరు, అమాయకమైన చూపులు చూపరులని ఇట్టే ఆకర్షిస్తాయి.



ఇటీవల హైదరాబాద్ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగిన ఒక సభలో శ్రీ ఎం.ఎల్. నరసింహారావుగారి గ్రంథం "జాతీయోద్యమ నిర్మాతలు" ఆవిష్కరించిన కేంద్ర ప్రణాళికా శాఖ మంత్రి శ్రీ పి.శివశంకర్. చిత్రంలో శ్రీ ఎ.వి. జనార్దనరావును కూడా చూడవచ్చు.

ఆమె మహారాణిలా వుంటుంది. ఆమె నవ్వితే ఎవరేనా సరే లోకం మర్చిపోవాల్సిందే. అందరిలా ఆమె అలంకరించుకుని వీధిలో నిల్చోనక్కరలేదు. ఆమె పొందు సామాన్యులకందుబాటులో వుండదు. పెద్ద పెద్ద రాజకీయ నాయకులకి, ఆఫీసర్లకి ఆమె పరిమితం. ఆమె గదిలో ఫోన్ వుంటుంది.

పగలు పనుల్లో మునిగిపోయే హేమాహేమీలు పొద్దు గూకేసరికి ఆమె పాదాల దగ్గర వాలాలని తహతహలాడి పోతారు.

ఒక రకంగా చెప్పాలంటే బ్రోతల్ కంపెనీ నడిపే రంగమ్మకామె ఓ శమంతకమణి!

ఆ రోజు ఆమె కాస్త బద్ధకంగా వుండి ఎవర్నీ ఆహ్వానించలేదు. పదే పదే మోగుతున్న ఫోన్‌ని విసుగ్గా పక్కకి పెట్టేసింది.

"నాగినీ!"

మంచం మీద వెల్లకిలా పడుకుని తిరిగే ఫేన్‌కేసి చూస్తున్న నాగిని త్రుళ్ళిపడి చూసింది.

ఎదురుగా రంగమ్మ!

"ఏవి టమ్మా?" అంది లేచి కూర్చుంటూ. రంగమ్మని అందరూ 'అమ్మా' అనే పిలుస్తారు.

"ఇంకా నిద్రపోలేదూ!" మృదువుగా అడిగింది రంగమ్మ.

"ఉ హూ !"

"ఆరోగ్యం ఎలా వుంది!" అంది ఆమె పక్కగా కూర్చుంటూ.

"ఆరోగ్యానికేం బానేవుంది. ఏమిటి సంగతి!" ఏదో చెప్పడానికొచ్చిందని గ్రహించిన నాగిని నవ్వుతూ అడిగింది.

"నీ కోసం విభీషణ వచ్చారు."

"విభీషణా?" కళ్ళు చిట్లించింది నాగిని.

"ఆ ! ప్రఖ్యాత రచయిత విభీషణ, నీతో ఏదో మాట్లాడాలట" వుత్సాహంగా అంది రంగమ్మ.

నాగిని మొహం గంభీరంగా అయిపోయింది.

"నాతో మాటలు వేరే ఏం వుంటాయి?"

"తెలియదు. ఓ గంట మాత్రం వుండి వెళ్తారు. ఆ గంటకే ఎంత కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా వున్నాడు" రహస్యంగా అంది రంగమ్మ.

"సరే రమ్మను!" లేచి నిల్చుంటూ అంది నాగిని.

రంగమ్మ కళ్ళు తళుక్కుమన్నాయి. ఆమె చెంపలు పుణికి ముద్దు పెట్టుకుని బైటికి నడిచింది.

పది నిమిషాల తర్వాత ప్రఖ్యాత రచయిత విభీషణ గదిలో కొచ్చాడు. డ్రెస్సింగ్ టేబిల్ ముందు కూర్చుని మరికాస్త మెరుగులు దిద్దుకుంటున్న నాగిని అద్దంలోంచి అతన్ని చూసి మధురంగా నవ్వింది. అతనూ నవ్వాడు.

"రండి, మీ రచనలు చదవడమేగానీ మిమ్మల్నెప్పుడూ చూళ్ళేదు" లేచి అతని చేతులు పట్టుకుని మంచం దగ్గరికి తీసుకొచ్చింది నాగిని.

"నా రచనలు మీరు చదివారా?" కుతూహలంగా అడిగాడతను మంచంమీద కూర్చుంటూ.

"ఊః! అగ్నిలో అతివ, మంటల్లో మగువ, నరకంలో నాతి, సుడిగుండంలో సుదతి, పంజరంలో పడతి... ఇంకా చాలా చదివాను... ఆడవాళ్ళ పట్ల మీకున్న గౌరవాభిమానాలు తెలుసుకున్నాను" అంది నాగిని తలుపులు బిగించి గడియపెడుతూ.

చీకటిలో బ్రతికే స్త్రీలక్కూడా తన రచనలు తెలుసనేసరికి పొంగిపోయాడతను. నలభై ఏళ్ళు దాటిన అతని శరీరం అదోలా పులకించి పోయింది.

"మా ఫ్రెండ్ చెప్పింది నిజంకాదు" ఆరాధనగా ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"మీ ఫ్రెండ్ ఏమన్నారు!" అమాయకంగా అంది నాగిని.

"మీరు అందంగా వుంటారని అన్నాడు మా రఘు."

"మరి లేనా?"

"అందంగా కాదు. దేవకన్యలా వున్నారు. మీ ముందు అందం తల దించుకుంటుంది!"

"రచయిత అనిపించారు" పక పక నవ్విందామె. నవ్వుతున్నప్పుడు ఎగసిపడే ఆమె గుండెల్ని మత్తుగా చూశాడతను.

"లైటుంచనా, తీసెయ్యనా?" ఓ కన్ను మూసి అదోలా అందామె.

"లైటుండాలి."

"ఓ!కె! రండి" జాకెట్, చీర విప్పి దూరంగా విసిరేసి అతని పక్కన కూర్చుంది నాగిని.

అతను కాంక్షగా చూశాడు.

"ఇంకా ఏవిటాలస్యం?" మత్తుగా వాలిపోయిందామె అతని మీద.

అతను రవంత దూరంగా జరిగాడు. బ్రా విప్పుతుంటే-

"అది విప్పద్దు" కంగారుగా అన్నాడతను.

త్రుళ్ళిపడిందామె.

"నేను... నేను అందుకోసం రాలేదు" మెల్లగా అన్నాడతను.

"మరెందుకొచ్చారు?" ఆశ్చర్యంగా అడిగిందామె.

"నేను ఒక సంచలనాత్మకమైన నవల రాస్తున్నాను. అందులో ఆడవాళ్ళు పడే అగచాట్లు, మగవారి నిరంకుశత్వం విపులంగా రాస్తున్నాను. మగవారి మాయల్లోపడి మీలాంటి అబలలు ఎందరు సమిధల్లా మసైపోతున్నారో తెలపడమే నా ధ్యేయం. అందుకే మీలాంటి వారి జీవిత చరిత్రల్ని సేకరిస్తున్నాను. కొందరి జీవితాల్ని గురించి తెలుసుకున్నాను. మీ గురించి నా ఫ్రెండ్ చాలా వున్నతంగా చెప్పాడు. అందుకే వచ్చాను. నా అంచనా ప్రకారం మీరో పెద్ద ఇంటి ఆడబడుచు. యామై కరెక్ట్?" అన్నాడతను.

క్షణం ఆమె మాట్లాడలేదు.

"చెప్పండి. మీ పేర్లు బైటికి రానివ్వను. ఈనాటి



మగాడు స్త్రీని ఎంత చులకనగా చూస్తున్నాడో గమనిస్తే గుండెలు ద్రవించి పోతున్నాయి. తల్లి, చెల్లి, భార్య, కూతురు కూడా ఆడవాళ్ళే అని మర్చిపోయి, పరాయి ఆడదాని కోసం పరుగులు తీస్తున్నారు. తమ అవసరాలకి వాడుకుని పువ్వులా చిదిమి వీధిలో పారేస్తున్నారు. ఇలాంటి ప్రపంచంలో నేనూ ఓ మగాణ్ణయి పుట్టినందుకు సిగ్గు పడుతున్నాను"– ఆవేశం, ఆవేదన నిండి వుంది విభీషణ స్వరంలో.

అంతా విన్న నాగిని స్టెడీగా కూర్చుంటూ - "మీకు నా చరిత్ర కావాలి. అంతే కదూ?" అంది సూటిగా.

"ఎస్! అవన్నీ కలిపి ఓ చక్కని నవల రాస్తాను" ఉత్సాహంగా అన్నాడతను.

"ఎందుకు?"

ఆ ప్రశ్నకి బిత్తరపోయాడతను.

"చెప్పండి. దానివల్ల మాకు ఒరిగేదేవిటి?" రెట్టించిందామె. ఆమె అడిగిన తీరుకు ఖంగుతిన్నాడతను.

"మీ .. బాధలు .. సమాజానికి చెప్పాలి ... మీరెలా

పరసం అయ్యారో వెత్తే ..."

"మా మీద మరికాస్త అసహ్యం పెరుగుతుంది. మీకు మాత్రం పేరు ప్రఖ్యాతులు, ధనాదాయం వచ్చి పడతాయి! కదూ?" అతని మాట పూర్తికాకుండానే అంది నాగిని.

"మీరు పొరపడుతున్నారు నాగినీ. నాకు ఆడ వాళ్ళంటే గౌరవం. స్త్రీలను నేను చెల్లిలా, తల్లిలా చూస్తాను ..."

"అవునా! .. మా మీద జాలి, అభిమానం, గౌరవం ... వున్నాయి కదూ?" సూటిగా అందామె.

"అవును ..."

"పోనీ, ఓ పని చెయ్యకూడదూ?"

"ఏమిటి?"

"మీ భార్య కాలం చేసిందని ఆ మధ్య పేపర్లో చూశాను. మీరు నన్ను పెళ్ళి చేసుకోకూడదూ? ఓ పతితని వుద్ధరించిన వారవుతారు" ఓరగా చూస్తూ అందామె.

తుళ్ళిపడ్డాడతను.

"అదెలా కుదురుతుంది?"

"ఏం! సమాజం మిమ్మల్ని వెలేస్తుందా?"

"అలా అని కాదు ..."

"ఇదిగో విభీషణ గారూ! ఆడవాళ్ళూ, అబలలు, జాలి అంటూ డైలాగ్స్ కొట్టడం మాని అసలు విష




యానికి రండి.

మీకు మంచి నవల కావాలి. దానికి నా సహాయం కావాలి. అంతేనా?" సూటిగా అంది నాగిని.

క్షణం తడబడ్డాడు విభీషణ.

"మీరు .. అపార్థం చేసుకుంటున్నారు" అని మాత్రం అన్నాడు మెల్లగా. ఆమె నవ్వింది.

"చూడండి మిస్టర్ విభీషణా! నేను లోకాన్ని, లోకం పోకడని బాగా చదివాను. ఈ రోజుల్లో బ్లేళ్ళు, సిగరెట్స్, బ్రాందీ, విస్కీల దగ్గర్నుంచి బందరు స్వీట్స్ వరకు ఆడవాళ్ళని అర్థనగ్నంగా చూపిస్తూ పబ్లిసిటీ ఇస్తున్నారు చాలా మంది.

సాధారణంగా ఏ రచనైనా హిట్ కావాలంటే, ఏ సినిమా అయినా కనకవర్షం కురిపించాలంటే ఆడది కష్టపడాలి. భర్తలు తిట్టి, కొట్టాలి. అత్తలు ఆరళ్ళు పెట్టాలి. ఇంకా కాదంటే కిరసనాయిలు పోసి తగ లెట్టాలి. అందమైన అమ్మాయిల్ని రేప్ చేయాలి. వాళ్ళు తిరిగి తిరిగి ఇలాంటి చోట్లకి రావాలి. చివరికి దిక్కులేని చావు చావాలి. అంతేనా మిస్టర్ విభీషణా?"

"కానీ, ఇవన్నీ రాసి, ఇన్ని సినిమాలు తీసి ఎంత మంది ఆడబడుచుల జీవితాల్ని రక్షిస్తున్నారు?" ఆమె శాంతంగానే అన్నా పదునుగా వుందామె గొంతు.

అతను నిశ్చేష్టుడైపోయాడు. అదేం గమనించనట్టు

"సరే! ... మీ బతుకులు మీవి, మా బతుకులు మావి. మీరు నా గురించి నవల రాసినంత మాత్రాన నేనేదో వుద్ధరింపబడతానని కాదుగానీ, మీకు నా కథ కావాలి, నాకు మీ డబ్బు కావాలి. కాబట్టి ఇద్దరం ఒక




ఒప్పందానికొద్దాం'' జాకెట్ వేసుకుంటూ అందామె.

''చెప్పండి'' నీరసంగా అన్నాడు విభీషణ.

''రేపు రాత్రి హోటల్ ప్రశాంత్‌లో ఓ ఏ.సి. రూమ్ తీసుకుందాం. మీకు చక్కని కథ చెప్తాను. ఫలితంగా నాకు వెయ్యి రూపాయిలివ్వాలి. ఓ.కె.?''

*   *   *

రాత్రి పది గంటలు దాటింది.

రూమ్ నుంచి నాగిని చేసిన ఫోన్‌కాల్ అందుకుని ఆటోలో వచ్చాడు విభీషణ. తననికాని, తన కారునికాని ఎవరైనా చూడ్డం అతనికిష్టం లేదు. అందుకే తలకి మఫ్లర్ చుట్టుకుని తలదించుకుని నాగిని చెప్పిన రూమ్ కెళ్ళాడు లిఫ్ట్‌లో.

కాలింగ్ బెల్ మోగింది సున్నితంగా.

మరుక్షణం తలుపులు తెరుచుకున్నాయి.

అర్ధనగ్నంగా వున్న నాగిని అతని చేతులు పట్టుకుని లోనికి లాగి తలుపులు బిగించింది.

టేబిల్ మీద విస్కీ, సోడాలు, చిప్స్ వగైరాలన్నీ అమర్చి వున్నాయి. హాట్ ప్లేట్స్‌లో డిన్నర్ వుంది.

''థాంక్యూ! నేనే చెప్పాలనుకున్నాను, హాట్ డ్రింక్స్ తీసుకుంటే కథ మరింత చక్కగా వస్తుందని. లక్కీగా మీరే అరేంజ్ చేశారు'' అన్నాడు విభీషణ.

ఆమె అందంగా నవ్వింది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ తాగారు.

ఇద్దరిలోనూ వుత్సాహం పెరిగింది.

''ఆకలిగా వుంది డియర్'' గోముగా అందామె అతని భుజాల మీదికి వాలిపోతూ.

''ఓ.కే. ముందు భోంచేద్దాం. తర్వాత కథ ప్రారంభిద్దాం'' డిన్నర్ ప్లేట్స్ సర్దుతూ అన్నాడు విభీషణ.

''ఆ .. ఆకలి కాదు'' వాలిపోతున్న కనురెప్పల్ని ఎత్తి మత్తుగా చూస్తూ ఒంటి మీదున్న మిగతా ఆచ్ఛాదనని లాగి పడేసింది నాగిని.

ఆమె నగ్న శరీరాన్ని చూసిన అతని కళ్ళు మెరిశాయి. ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసి —

''ముందు డిన్నర్. తర్వాత .. కథ .. ఆ తర్వాత ఈ కథ!'' అన్నాడు ఆమె చెవిలో గుసగుసగా. ఆమె పకపకా నవ్వింది. ఆ నవ్వుకు శరీరమంతా కంపించింది. మెలికలు తిరిగిపోయిన విభీషణ చీర ఆమె చుట్టూ కప్పి —

''ముందు భోంచెయ్యి'' అన్నాడు.

''తప్పదంటావా?'' బుంగమూతి పెట్టిందామె.

ఇద్దరి సంభాషణా బహువచనంలోంచి ఏకవచనం లోకి దిగింది.

డిన్నర్ ముగించారు.

''ఇప్పుడు చెప్పు ..'' పెన్ను, పేపరు తీసుకుంటూ అన్నాడు విభీషణ. ఆమె మంచం మీద వాలి మొదలు పెట్టింది.

''నేనొకతన్ని ప్రేమించాను. అతనితో వెళ్ళిపోయాను. అతను కొన్నాళ్ళు నన్ను వాడుకుని మోజు తీరగానే ఓ బ్రోతల్ హౌస్‌కి అమ్మేసి పరారయ్యాడు ... ఏం! బాగా లేదా!'' కథ ఆపి అడిగింది నాగిని విభీషణ



ఇటీవల విజయవాడలో జరిగిన ''సందిగ్ధ సంధ్య'' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న కవయిత్రి శ్రీమతి కొండేపూడి నిర్మల. వేదికపై శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, శ్రీ తుర్లపాటి కుటుంబరావు ప్రభృతులు వున్నారు.

మొహం చూసి.

''ఏం లేదులే చెప్పు'' అన్నాడతను నీరసంగా.

''ఓ! ఇది నీకు నచ్చినట్టు లేదు. మరో కథ చెప్తాను విను. నేను సినిమాలో వేషం కోసం మద్రాస్ వెళ్ళాను. అక్కడ ఒంటరిగా వున్న నన్ను చూసి ఓ డైరెక్టర్ సినిమాలో వేషం ఇస్తానని చెప్పి ...''

''అదేవిటి మళ్ళీ?'' అయోమయంగా అన్నాడు విభీషణ.

''అరె! ఇదీ బాగా లేదా. పోనీ మరో కథ చెప్తాను.'' ''ఓ తిరునాల్లో జైంట్‌వీల్ ఎక్కుతున్న నన్ను ఓ యువకుడు ఆరాధనగా చూసి మెల్లగా దగ్గరికి చేరి ...''

''నాగినీ'' చిరాగ్గా అరిచాడు విభీషణ.

''ఏవిటి? ఇదీ బోరేనా! ... లేకపోతే ఈ కథలు ఆల్‌రెడీ ఎవరైనా చెప్పేశారా?'' అమాయకంగా అంది నాగిని.

''నాకీ కథలు కాదు కావల్సింది. నీ అసలు కథ!''

''ప్చ్! మాలాంటి వాళ్ళ కథలన్నీ ఇలాగే వుంటాయి డియర్! ఏదో ఒకటి రాసుకో'' అందామె.

''నో! నాకు నీ జీవిత కథ చెప్తానని ప్రామిస్ చేశావ్!'' అన్నాడతను నిష్ఠూరంగా.

ఆమె ఆలోచనలోపడింది.

''చెప్పు! నీ పేరేవిటి?'' అన్నాడతను అనునయంగా

''నాగిని.''

''నీ అసలు పేరు.''

''ప్చ్! పేరులో ఏం వుంది. సరే నువ్వు అంతగా అడుగుతున్నావు కనుక చెప్తాను. కానీ ఇలా కాదు'' అందామె అల్లరిగా.

''మరెలా?''

''ఇద్దరం నగ్నంగా మంచంమీద పడుకుని...''

''అలాగే'' అన్నాడతను నవ్వుతూ.

అతని మనసు, శరీరం కూడా ఆమె పొందు కావాలని తొందర చేస్తున్నాయి.

మంచం మీదికి చేరారిద్దరూ. అతని బట్టలు దూరంగా విసిరేసిందామె కిలకిల నవ్వుతూ. పది నిమిషాల తర్వాత ఆమె మీద కాలూ, చెయ్యీ పడేసి-

''ఇప్పుడు చెప్పు'' అన్నాడతను.

''నా పేరు... అయ్ మీన్ నా అసలు పేరు అనసూయ'' అందామె. తృళ్ళిపడ్డాడతను.

''అవును. మాలో చాలా మంది పేర్లు అనసూయ, అరుంధతి, సుమతి ల్లాంటి పతివ్రతల పేర్లు కూడా వుంటాయి'' నవ్విందామె.

అతనూ నవ్వాడు.

''నేను చాలా పేద ఇంట పుట్టాను. నాకు పదిహేనేళ్ళ వయసులో పెళ్ళి చేసి అమ్మా నాన్నా ఓ యాక్సిడెంట్‌లో పోయారు.

'' రెండు నెలల కాపురంలో అతన్ని గురించి నాకు చాలా విషయాలు తెలిశాయి.

''అతనో కాంట్రాక్టర్. అమ్మాయిల్ని పంపి ఇంజనియర్స్‌తో పనిచేయించుకోవడంలో అతను ఘటికుడు.

చివరికి నన్ను కూడా తన స్వలాభం కోసం కొందరికి తార్చాడు. దిక్కూ మొక్కూ లేని నా మొర ఎవరూ ఆలకించలేదు. ఓ సంవత్సరం తర్వాత నన్ను నలిపేసిన పువ్వులా, ఓ బ్రోతల్ హౌస్‌కి అమ్మేసి చేతులు కడుక్కున్నాడు. తర్వాత నేను ఎన్నో వూళ్ళు మార్చబడ్డాను. చివరికి ఈ రంగమ్మ దగ్గర స్థిరంగా వుండిపోయాను. రంగమ్మ నన్ను చాలా బాగా చూస్తోంది. అన్నట్టు టైమెంతయింది!'' అంది నాగిని. అతను ఏదో అనబోయేంతలో-

''నా దగ్గర సిగ్గేవిటి డియర్!'' అల్లరిగా అతను కప్పుకున్న బ్లాంకెట్ తీసి పడేసింది.

అప్పుడే అతని మీద ఏదో వెలుగు పడింది.

బిత్తరపోయాడతను.

తేరుకునేలోగానే తలుపు బాదారెవరో.

గభాల్న లేచి బట్టలకోసం చూసుకున్నాడు విభీషణ.

"అవి లేవు డియర్! మా పంకజం ఎక్కడో దాచేసింది" వల్లగా అంది నాగిని.

"పంకజమా!"

"అవును నేనే పంకజాన్ని!" అంటూ వచ్చిందో అర్ధ నగ్న సుందరి బాత్‌రూమ్‌లోంచి.

ఆమె చేతిలో కెమేరా వుంది.


మరోసారి తలుపు బాదారు ఎవరో.

విభీషణ మంచం మీద వారి బ్లాంకెట్ ముసుగు పెట్టుకున్నాడు. మెల్లగా తలుపు తీసింది పంకజం. బిలబిల్లాడుతూ వచ్చారు పోలీసులు.

"ఓ! ఇద్దరూ ఇక్కడే వున్నారా పదండి" కోపంగా అన్నాడు ఎస్సై.

"అవునుసర్! పాపం! ఈయనకి ఒకేసారి ఇద్దరు యువతులతో అనుభవం కావాలని సరదా పడ్డారు. ఈయన్నొదిలెయ్యండి. ఈయన ఫేమస్ రైటర్ మిస్టర్ విభీషణ... ఈ సంగతి బయట తెలిస్తే ఆయన పరువు పోతుంది" దీనంగా వేడుకుంది నాగిని పీర కప్పుకుంటూ.

"నా తండ్రే! నువ్వేనా నాయనా స్త్రీ జనోద్ధరణ చేసే రచయిత విభీషణవి! చెప్పేవి శ్రీరంగనీతులు, దూరేవి సానికొంపలూను..." హేళనగా అన్నాడు ఎస్సై.




విభీషణ మొహం పాలిపోయింది.

"సర్! ఆయన బైటికి రావాలంటే బట్టలు వేసుకోవాలి. ప్లీజ్ కాస్సేపు మీరు బైటికి వెళ్ళండి" అంది పంకజం

"తొరగా ఏడవండి..."! అంటూ బైటికి నడిచాడు ఎస్సై బలగంతో సహా.

పంకజం చేతిలోని బట్టలు అతని మొహాన పడేస్తూ-

"ఇదిగో విభీషణా! నేనెవర్నో తెలిసిందిగా? నీ చేత తాళి కట్టించుకుని అన్యాయం అయిపోయిన అనసూయని. నువ్వు నన్ను గుర్తు పట్టలేదు కదూ? అవున్లే ఎలా గుర్తు పడతావ్! పదిహేనేళ్ళ ముద్దరాలు ఆనాటి అనసూయ! లోకం తెలిసిన పతిత ఈ నాగిని! ఈ నాటితో నా కక్ష తీరింది... నీ చరిత్ర పేపర్ల కెక్కుతుంది... ఛీ..." నాగిని ఛీత్కారంతో గది ప్రతిధ్వనించింది.

*

